
అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....


# వన్ నేషన్


RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 249 ఎడిటర్: కె.యువరాజ్ శుక్రవారం 19-6-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్దిక
శుభాకాంక్షలు


## వనమహోత్సవానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా, జూన్ 18 (వన్‌నేషన్):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం గుర్రంగూడ ఎకో పార్క్‌లో మొక్క నాటి వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎకో పార్క్‌లో మొక్క నాటిన అనంతరం ఎకో పార్క్‌లో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు.

గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అదేవిధంగా నిజామాబాద్, కొత్తగూడెం, హనుమకొండ, మెదక్, మహబూబ్‌నగర్, ములుగు, నారాయణపేట, భూపాలపల్లి, సంగారెడ్డి, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో రూ.17.66 కోట్ల విలువైన అర్బన్ పార్కులు, ఎకో పార్కులు, వన్యప్రాణి సంరక్షణ, జూ ఆధునీకరణ, నివాస భవనాలు, పర్యావరణ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ విధంగా మొత్తం రూ.35.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ ఎకో పార్క్, మూసీ ప్రక్షాళన, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ ఎల్‌బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్నారు. 2018లో కొడంగల్‌లో ఓటమి అనంతరం సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తనకు మల్కాజ్‌గిరి ఎంపీగా అవకాశం కల్పించారని, ఎల్‌బీ నగర్ ప్రజలు 30 వేల మెజారిటీతో తనకు అండగా నిలిచారని గుర్తు చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మూడేళ్లు ప్రజల కోసం పోరాడి, లక్షలాది మంది ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఎల్‌బీ నగర్, బీఎన్ రెడ్డి, వనస్థలిపురం, గుర్రంగూడ ప్రాంతాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ ప్రాంతంలో రూ.2,400 కోట్ల వ్యయంతో 240 ఎకరాల్లో

5లో




**- ఉద్యోగాలకే వారు పరిమితం కాకూడదు - రూ.30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం - 50 కంపెనీల ద్వారా 29,677 ఉద్యోగాలు**

**అమరావతి, జూన్ 18 (వన్‌నేషన్):** రాష్ట్రంలో పెద్దఎత్తున జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు అందేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పరిశ్రమలు, కంపెనీలను ధనికులు మాత్రమే స్థాపించగలరన్న అభిప్రాయం పోయేలా చొరవ తీసుకోవాలని స్పష్టం చేశారు. సామాన్యులు కూడా స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని, దీని కోసం రాష్ట్రంలో తగిన పారిశ్రామిక ఎకో సిస్టమ్‌ను రూపొందించాలని చెప్పారు. గురువారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 18వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రూ. 30,515 కోట్లతో 50 పెట్టుబడి ప్రతిపాదనలను ఆమోదించారు. వీటి ద్వారా 29,677 ఉద్యోగాలు రానున్నాయని కంపెనీలు తమ ప్రతిపాదనల్లో వెల్లడించాయి. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "పేద, మధ్య తరగతి వర్గాలకు ఉద్యోగాలు కల్పించడమే కాకుండా సామాన్యులు కూడా కంపెనీలు స్థాపించే అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలి. స్టార్టప్ కంపెనీలకు పెద్దఎత్తున ప్రోత్సాహం ఇవ్వాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సేవలను సద్వినియోగం చేసుకునేలా చూడాలి. ఆర్టీఐహెచ్ పరిధిలో స్టార్టప్ కంపెనీలకు వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు వచ్చేలా

5లో

## జనసేన పార్టీ తెలంగాణ కార్యాలయం ప్రారంభించనున్న పవన్ కల్యాణ్



**హైదరాబాద్, జూన్ 18 (వన్‌నేషన్):** నగరంలో జనసేన తెలంగాణ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12.00 గంటలకు మల్కం చెరువు సమీపంలోని పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభిస్తారు. ఈ నూతన కార్యాలయంతో తెలంగాణలో పార్టీ విస్తరణకు పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టనున్నారని తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఇప్పటికే రాష్ట్రంలోని జనసైనికులు, వీరమహిళలు, నాయకులకు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి భారీగా జనసైనికులు తరలి వస్తారని నేతలు అంచనా వేస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన కార్యకలాపాలకు ఈ నూతన కార్యాలయం కేంద్రంగా మారనుందనే ప్రచారం సాగుతోంది. ఈ కొత్త కార్యాలయం ఏర్పాటు తర్వాత.. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, చేరికలపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫోకస్ చేస్తారని తెలుస్తోంది.

## మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**- మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం - మైనారిటీ సంక్షేమంపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి**



**హైదరాబాద్, జూన్ 18 (వన్‌నేషన్):** రాష్ట్రంలోని మైనారిటీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని తెలిపారు. మైనారిటీల సంక్షేమంపై సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనారిటీ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సమీక్షలో భట్టి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నామని తెలిపారు. మైనారిటీ యువతకు స్వయం

5లో

## 26 నుంచి 28 వరకు రిజిస్ట్రేషన్ సేవలు బంద్




**హైదరాబాద్, జూన్ 18 (వన్‌నేషన్):** స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో తరచూ తలెత్తుతున్న సర్వర్ సమస్యలను పరిష్కరించేందుకు రిజిస్ట్రేషన్ శాఖ సిద్ధమైంది. సర్వర్ నిర్వహణ వల్ల రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌తోపాటు ఇతర ఆన్‌లైన్ సేవలు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సుమారు ఐదేళ్ల తర్వాత సర్వర్ నిర్వహణ పనులు చేపడుతున్నామని, ఇకపై సేవల నాణ్యత, భద్రతా ప్రమాణాలు మరింత మెరుగవుతాయన్నారు. జూన్ 26న మొహరం, జూన్ 28న ఆదివారం ప్రభుత్వ సెలవులు ఉన్నందున.. జూన్ 27న ఒక్క రోజు మాత్రం రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు రిజిస్ట్రేషన్ పనుల కోసం ముందస్తు ప్రణాళిక చేసుకోవాలని, జూన్ 29 నుంచి అన్ని సేవలు యథావిధిగా అందుబాటులోకి వస్తాయన్నారు.


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని



అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

వన్ నేషన్
తెలుగు దినపత్రిక
శుక్రవారం || 19 || జూన్ || 2026

# నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం అందించడం
# పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం:సైబరాబాద్ సీపీ

**- సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేశ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో నేర సమీక్ష సమావేశం - పెండింగ్ కేసుల పరిష్కారం, ట్రాఫిక్ నిర్వహణ, మహిళలు-చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి**



సైబరాబాద్, జూన్ 18 (వన్ నేషన్): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పెండింగ్ కేసుల త్వరితగతిన పరిష్కారం, కోర్టు వ్యవహారాల పురోగతి మరియు ప్రజా భద్రతకు సంబంధించిన అంశాలపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేశ్, ఐపీఎస్., అధ్యక్షతన సైబరాబాద్ సీపీ ఆఫీసులోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్ లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిషనరేట్ పరిధిలోని జోనల్ డీసీపీలు, అదనపు డీసీపీలు, క్రైమ్ విభాగాల అధికారులు హాజరయ్యారు.

సమావేశంలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, కోర్టు కేసులు, పీటీ కేసులు, ఈఓడబ్ల్యూ కేసులు, యూఐ కేసులు, కిడ్నాప్ కేసులు, సైబర్ క్రైమ్ కేసులు, పోక్సో, అత్యాచారం, హత్య కేసులు మరియు ఇప్పటివరకు ఛేదించని గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిని సీపీ సమీక్షించారు. తీవ్రమైన నేరాల దర్యాప్తులో వేగం పెంచి, నిందితులను గుర్తించి చట్టం ముందు నిలబెట్టేందుకు అన్ని వనరులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు.

మహిళల భద్రత, చిన్నారుల రక్షణకు సంబంధించిన కేసులను అత్యంత ప్రాధాన్యంతో విచారించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే జీరో ఎఫ్ఐఆర్ కేసుల నమోదు, ఇతర పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన మరియు బదిలీ చేసిన కేసుల వివరాలను సమీక్షించి, బాధితులకు తక్షణ సేవలు అందేలా చూడాలని పేర్కొన్నారు.

డయల్-100 కాల్స్‌కు స్పందన, ఫుట్ పెట్రోలింగ్, క్షేత్రస్థాయి పోలీసింగ్, సీడీవోల విధుల నిర్వహణ, నేర నియంత్రణలో కన్విక్షన్ రేటు పెంపు అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. కేసుల దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచి, కోర్టుల్లో శిక్షలు పడే శాతాన్ని పెంచేందుకు పటిష్టమైన సాక్ష్యాధారాలు సమర్పించాలని సూచించారు.

సీసీటీఎన్ఎస్ (CCTNS) డేటా అప్‌డేషన్, ఆన్-సైట్ ఎఫ్ఐఆర్ విధానం అమలు, సైబర్ నేరాల దర్యాప్తు, ఆర్థిక నేరాల విచారణ డిజిటల్ రికార్డుల నిర్వహణపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసుకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో అప్‌డేట్ చేయాలని అధికారులకు ఆదేశించారు.

అదేవిధంగా డ్రగ్స్ నిర్మూలన చర్యలు, కార్మిక శిబిరాల (లేబర్ క్యాంప్స్) పరిస్థితులు, పెండింగ్ నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలు, లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి ఐటీ కారిడార్, ప్రధాన జంక్షన్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు.

సమావేశం ముగింపులో సీపీ డా. ఎం. రమేశ్ మాట్లాడుతూ, "ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణ , బాధితులకు సత్వర న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తూ పెండింగ్ కేసుల పరిష్కారం, మహిళలు మరియు చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి" అని సూచించారు. ఈ సమావేశం లో సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, ఐపీఎస్., అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఐపీఎస్., కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్., కూకట్పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్., శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్., డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, డబ్ల్యు అండ్ సీఎస్డబ్ల్యూ డీసీపీ సృజన కరణం, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్ హెచ్ ఓ లు తదితరలు పాల్గొన్నారు.

# అడవులు తగ్గిపోతున్నాయి, నీరు ఆరిపోతోంది,
# నేల తన శక్తిని కోల్పోతోంది: మంజుల పత్తిపాటి



హైదరాబాద్, జూన్ 18 (వన్‌నేషన్): మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజుల పత్తిపాటి మీడియా మిత్రులు మరియు పత్రికా విలేకరులకు నమస్కారాలు తెలుపుతూ ప్రపంచ ఎడారీకరణ మరియు కరవు నిర్మూలన (జూన్ 17) న దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ భూమి మన తల్లి. కానీ నేడు ఆ తల్లి మౌనంగా ఏడుస్తోంది... అడవులు తగ్గిపోతున్నాయి, నీరు ఆరిపోతోంది, నేల తన శక్తిని కోల్పోతోంది. ఒకప్పుడు పచ్చగా నవ్విన భూమి... నేడు ఎడారిగా మారితే అది కేవలం ప్రకృతి మార్పు కాదు... మన నిర్లక్ష్యానికి నిదర్శనం అని అన్నారు. ఒక చెట్టు నరికితే కేవలం చెట్టు పోదు... ఒక పక్షి గూడు పోతుంది, ఒక నీడ పోతుంది, ఒక జీవితం పోతుంది. మన చేతిలో ఉన్న ప్రతి నీటి బొట్టు విలువైనది. దాన్ని వృథా చేస్తే రేపటి తరాలకు కన్నీళ్లే మిగులుతాయి అని తెలిసి కూడా పకృతి ని నాశనం చేస్తున్నామని అని అన్నారు. మనందరం మొక్కలు నాటడం, నీటిని పొదుపుగా వినియోగించడం, భూసారాన్ని కాపాడే వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా భవిష్యత్ తరాలకు సుసంపన్నమైన భూమిని అందించవచ్చు కనుక ఈ రోజు మనం ఒక చిన్న నిర్ణయం తీసుకుందాం. ఒక మొక్క నాటుదాం, నీటిని కాపాడుదాం, భూమిని ప్రేమిద్దాం.అని అన్నారు. "భూమి కాపాడితేనే మన భవిష్యత్తు నిలుస్తుంది... లేకపోతే భవిష్యత్తు మనకే దూరమవుతుంది." ఇది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి అని అన్నారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ ఓటరు జాబితా
# ప్రత్యేక సమగ్ర సవరణ పై అవగాహన సమావేశం

**- సార్ కార్యక్రమం పై, ఎన్యూమరేషన్ ఫామ్ , కావల్సిన సంబంధిత పత్రాల పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి...చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి - SIR కార్యక్రమం లో బి.ఎల్.ఏ, బి.ఎల్.ఓ లా పాత్ర ఎంత కీలకమో ప్రజలకు అవగాహన కల్పించడం అంతే కీలకం...రాష్ట్ర నాయకులు మర్రి శశిధర్ రెడ్డి - బి.ఎల్.ఏ లు ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఇంటి ఇంటి సర్వే లో పాల్గొనాలి...జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి - పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు, నాయకులకు, కార్యకర్తలకు ఇదే సువర్ణ అవకాశం - బూత్ లో నీ దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు తొలగించి, ఒకే ఇంట్లో ఉన్న ఫ్యామిలీ ఓట్లు అదే బూత్ వచ్చేలా చూడటం అలాగే ఓట్లు లేని కొత్త ఓటర్లకు అవకాశం కల్పించాలని బి.ఎల్.ఏ దిశానిర్దేశం చేసిన...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్**






శేరిలింగంపల్లి ప్రతినిధి, జూన్ 18 (వన్ నేషన్): గురువారం చందా నగర్ క్రిస్టల్ గార్డెన్స్ లో నిర్వహించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ బి.ఎల్. ఏ లు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మర్రి శశిధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి,బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్ రావు,అజిత్ , ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, మహిళా మోర్చా కార్యదర్శి పద్మ, ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు హనుమంత్ నాయక్ , రాష్ట్ర నాయకులు బల్దా అశోక్, కాంచన కృష్ణ, జిల్లా కార్యదర్శి మాణిక్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ గౌడ్,జిల్లా ఇంచార్జి ఆలే భాస్కర్, సార్ ఇంచార్జి చెన్న కేశవ రెడ్డి, వెంకట రమణ మరియు ఇతర నాయకులు కార్యకర్తలు,బి.ఎల్. ఏ లు పాల్గొన్నారు, ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బి. ఎల్. ఏ లు ప్రతి రోజు బి.ఎల్.ఓ లతో పాటు రోజు ప్రతి ఇంటికి వెళ్ళాలని, ఎన్యూమరేషన్ ఫామ్ లు, బి.ఎల్.ఓ ఇవ్వాల్సిన సంబంధిత పత్రాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి వారి నుండి వివరాలు సేకరించేలా చూడాలన్నారు, మర్రి శశిధర్ రెడ్డి గారు మాట్లాడుతూ బి.ఎల్. ఏ కు ఆ బూత్ లో ఎన్ని వోట్లు ఉన్నాయి, ఏ వర్గాల వారు ఉన్నారు ఇలా అవగాహన ఉండాలని, అలాగే గేటెడ్ కమ్యూనిటీలలో బూత్ ఏర్పాటు చేయించడానికి, మన యాప్ ద్వారా వివరాలు నింపి ఓటర్లు కు ఫామ్ లు అందజేస్తే చాలా సులువుగా ఉంటుందని తెలియజేశారు, జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల రోజులు ప్రతి బి.ఎల్.ఏ ఇంటి ఇంటి సర్వే లో పాల్గొని రోజు వారిగా వచ్చిన వివరాలను నాయకులకు అందజేయాలని , సీనియర్ నాయకులు, శక్తి కేంద్ర ఇంచార్జులు ,జిల్లా నాయకులు వారి అండగా ఉండాలని సూచించారు, రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ పోటీ చేయాలనుకునే ప్రతి ఒక్కరూ మీ డివిజన్ల లో తిరగాలని, మీకు ూ×= సువర్ణ అవకాశమని, ప్రతి రోజులు బి.ఎల్. ఏ నుండి రిపోర్ట్స్ తీసుకుంటు బి.ఎల్. ఏ లకు అండగా ఉండాలన్నారు, బి.ఎల్.ఏ లు లేని బూత్ లలో మన నాయకులు , మన అనుబంధ సంస్థల నాయకులు పర్యటించేలా చూడాలన్నారు, ఇంటి ఇంటి కి తిరగడం వలన ఈ నెల రోజులు ప్రతి ఇంట్లో ఎవరు ఉన్నారు, ఎవరు లేరు అనేది మీకు అర్థం అవుతుందని మనకు ఎలక్షన్స్ లో వారిని గుర్తించడం సులువుగా ఉంటుందన్నారు, బి.ఎల్. ఏ లు ఎవరైతే లేరో వాళ్ళ ఓటు తీయించి, ఉన్న వాళ్ళకు ఓటు హక్కు కల్పించాలని అలాగే డబుల్ ఓట్లు ,దొంగ ఓట్లు తీయించడానికి ఇదే సరైన అవకాశమని, ఒకే ఇంట్లో ఉంటున్న ఫ్యామిలీ వేరే వేరే బూత్ లలో ఉన్న ప్రతి ఓటు అదే బూత్ లో వచ్చేలా చూడాలన్నారు, బి.ఎల్.ఏ ప్రతి రోజు ఇంటి ఇంటి సర్వే అయిపోయిన వెంటనే బి.ఎల్.ఓ లా వద్ద నుండి గురువారం ఎంత మంది ఓటర్లు ను కలిశాం ,ఫామ్ 6 ఎన్ని వచ్చాయి,ఫామ్ 7 ఎన్ని వచ్చాయి,ఫామ్ 8 ఏన్ని వచ్చాయి ఇలా వివరాలను సేకరించి నాయకులకు అందజేయాలన్నారు, ఈ సర్వే జరిగే సమయంలో వేరే పార్టీ బి.ఎల్. ఏ లు ఏదైనా సమస్య చేస్తుంటే వెంటనే మీకు దగ్గరలోని నాయకులకు, కార్యకర్తలకు వెంటనే సమాచారం ఇవ్వాలని మీకు ఏ అవసరం ఉన్న, ఏ సమస్య ఉన్న మీకు అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బాల్ద అశోక్, రవీందర్రావు, కేశవరావు, బుచ్చిరెడ్డి ,వసంత్ యాదవ్ , ప్రభాకర్ యాదవ్ ,అనిల్ గౌడ్, మాణిక్ రావు అజిత్, ఎల్లేష్, రామరాజు, కృష్ణంరాజు, దుర్గాప్రసాద్ , పద్మ ,విజయలక్ష్మి, కాంచన కృష్ణ, మల్లేష్ గౌడ్ ,అర్జున్, రామ్ రెడ్డి, గణేష్ మొదలగు వారు పాల్గొన్నారు.

## ఎమ్మెన్నార్ ఇండో ఇంగ్లీష్ స్కూల్ అధిక ఫీజులపై
# డీఈవోకు వినతిపత్రం

**తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ**

హైదరాబాద్, జూన్ 18 (వన్‌నేషన్): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ స్వర్ణపురి లోని ఎమ్మెన్నార్ ఇండో ఇంగ్లీష్ స్కూల్ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు, లేట్ ఫీజులు, జుఞ్తీఞ కరికులం, స్పెషల్ ఫీజుల పేరుతో నిలువు దోపిడికి పాల్పడుతోందని, యూనిఫామ్, బుక్స్ ను బలవంతంగా అదే స్కూల్ లో అధిక ధరలకు అమ్ముతు న్నారని ఆరోపిస్తూ ఏఐఎఫ్డిఎస్ హైదరాబాద్ కమిటీ మరియు రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పల్లె మురళి గారి ఆధ్వర్యం లో సంబంధిత స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి నేడు రంగారెడ్డి జిల్లా విద్యా అధికారి శ్రీ వెంకటేశ్వర్లు మరియు అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణచందర్రావు గారిని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. వినతిపత్రంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను మానసికంగా వేధించడం, ఫీజు చెల్లించనివారిని విడిగా కూర్చోబెట్టి అవ మానించడం, పరీక్షలకు అనుమతించమని బెదిరించడం,





నిబంధనలకు విరుద్ధంగా అధిక లేట్ ఫీజులు వసూలు చేయడం వంటి అంశాలను ప్రస్తావించారు. అలాగే యూనిఫామ్, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్ ను బహిరంగ మార్కెట్ కంటే అధిక ధరలకు స్కూల్ లోనే కొనాలని బలవంతం చేస్తున్నారని తెలిపారు. వినతిని స్వీకరించిన డీఈవో శ్రీ వెంకటేశ్వర్లు మరియు అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణచందర్రావు గారు విషయాన్ని సీరియస్ గా పరిగణించి, వెంటనే విచారణ జరిపి నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల హక్కులు, మానసిక శ్రేయస్సుకు భంగం కలిగితే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి, హైదరాబాద్ కమిటీ సభ్యులు ఈశ్వర్, జెడి గణేష్ మరియు స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తూము నిఖిల్‌కుమార్‌ని అక్రమంగా గృహనిర్బంధం



కూకట్‌పల్లి ప్రతినిధి, జూన్ 18 (వన్‌నేషన్): బిఆర్ఎస్ (వి) ఆధ్వర్యంలో ఎలాంటి ధర్నా, ముట్టడి కార్యక్రమాలకు పిలుపునివ్వనప్పటికి పోలీసులు కూకట్ పల్లి బిఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు తూము నిఖిల్ కుమార్ ని అక్రమంగా గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ (వి) ఎలాంటి ధర్నాలు లేదా ముట్టడి కార్యక్రమాలకు పిలుపునివ్వనప్పటికీ, ముందస్తు జాగ్రత్తల పేరుతో పోలీసులు ఈ చర్యకు పాల్పడటాన్ని ఆయన ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష విద్యార్థి సంఘాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడటం విద్యార్థి నాయకులుగా మా బాధ్యత అని ప్రకటించారు.

# వృద్ధులకు బాసటగా పెద్ది శంకర్

## -ఎంతోమంది వృద్ధులను అక్కున చేర్చుకొని కుటుంబ సభ్యులు లాగా చూసుకుంటున్న పెద్ది శంకర్ - తన అంతరంగం ఏంటో తెలుసుకుందాం :



హైదరాబాద్, జూన్ 18 (వన్‌నేషన్): తెలంగాణలోని మాడ్గులపల్లి మండలం గార్లకుంటపాలేనికి చెందిన పెద్ది శంకర్ గౌడ్ చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయాడు. డిగ్రీ వరకూ చదువుకుని నగరంలో ఓ ఆస్పత్రిలో ఉద్యోగంలో చేరాడు. అప్పుడే ఆస్పత్రులకు వచ్చే







రోగులు, వారి సహాయకుల ఇబ్బందులు గమనించి 2011లో 'రెడీ టూ సర్వ్' ఫౌండేషన్ ఏర్పాటుచేసి ఆ పేరున వారికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ప్రతి ఆదివారం హైదరాబాద్ లోని ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద వందలాది మంది రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేస్తున్నాడు. అయినవారు ఉండీ బాగోగులు చూసేవారు లేక అనాధలుగా మారుతున్న వృద్ధులు కొందరు. ఆర్థిక ఇబ్బందులతో కన్నవారిని సాకలేక రోడ్డుపై వదిలేస్తున్నవారు మరికొందరు. అలాంటి వారిని చేరదీసి అక్కున చేర్చుకుని వారి బాగోగులు చూస్తూ వారికి వైద్యసేవలు అందిస్తూ ముందుకు సాగుతోంది రెడీ టు సర్వ్ ఫౌండేషన్, అంతేకాకుండా రోగుల కోసం పలు ఆస్పత్రుల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇంకా సేవలందించేందుకు వనస్థలిపురంలో ఉచిత ఓల్డ్ ఏజ్ హోం ఏర్పాటు చేశారు. అక్కడ 60 మందికి పైగా వృద్ధులకు బాసటగా నిలుస్తున్నారు.

నిరంతర సేవ : ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి, వనస్థలిపురం ప్రాంతాల్లో ఆస్పత్రుల వద్ద ఇప్పటికే పలుమార్లు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఎల్బీనగర్ చౌరస్తాలో ఇటీవల 100 రోజులపాటు రోజు 100 మందికి అల్పాహారం అందించారు. రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. హోమ్ లోని వృద్ధులకు కామినేని ఆస్పత్రి సహకారంతో నెలకోసారి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే ముత్తూట్ సంస్థ ఆధ్వర్యంలో వృద్దులకు తరచూ బీపీ, షుగర్ పరీక్షలు చేయిస్తున్నారు. దీంతోపాటు అవసరమైన వారికి ఆక్సీజన్ కాన్సంట్రేటర్స్, వీల్ చైర్స్, ఐసీయు బెడ్స్, వాకర్స్ ఉచితంగా ఇస్తున్నారు. అవసరం తీరిన తర్వాత వాటిని తిరిగి ఫౌండేషన్ కు అప్పగించాల్సి ఉంటుంది. వెసులుబాటు ఉన్న వారు ఫౌండేషన్ కు డొనేషన్ ఇవ్వవచ్చు.

ఒక వారియర్ గా : వృద్ధులకు ఎలాంటి కష్టం వచ్చినా 24 గంటలు ఒక కుటుంబ సభ్యుడి లాగా ఎంతో నిస్వార్ధ సేవ చేస్తున్నాడు పెద్ద శంకర్. తాను అక్కున చేర్చుకున్న వృద్ధులు తమకు ఇక్కడ ఎలాంటి ఇబ్బంది లేదని అన్ని వసతులు ఉన్నాయని, చాలా సంతోషంగా ఉన్నామని, పెద్ది శంకర్ తమను సొంత కుటుంబీకులుగా చూసుకుంటున్నాడని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే వారికి సేవ చేసేందుకు తన సొంత కృషితో నర్సింగ్ కేర్, కేర్ టేకర్, ఫిజియోథెరఫీ సేవలు అం దిస్తున్నాడు. వాటి ద్వారా వచ్చే డబ్బు, దాతల విరా ళాలతో ఓల్టేజీ హోం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం హోమ్ లో 60 మంది ఉన్నారు. నెలకు సుమారు రూ. లక్షకు పైగా ఖర్చు అవుతోంది. ప్రస్తుతం ఉన్న ఇల్లు సరి పోవడం లేదు. సేవలను విస్తరించేందుకు దాతల కోసం చూస్తున్నారు. ప్రభుత్వం తన సేవలను గుర్తించి హైదరాబాద్ ప్రాంతంలో ఒక స్థలాన్ని విరాళంగా ఇస్తే మరింత మందికి తోడ్పాటు అందించేందుకు సిద్ధంగా ఉంటానని మీడియా ముఖంగా పెద్ది శంకర్ వెల్లడించారులి మరిన్ని వివరాల కొరకు 8790815527 నెంబర్ కు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## శ్రీరంగం ఫౌండేషన్ ద్వారా చిన్నారి శాస్త్ర మహికి ప్రోత్సాహం అందించిన

# కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం




కూకట్‌పల్లి ప్రతినిధి, జూన్ 18 (వన్‌నేషన్): వ్యక్తిగత విజయంతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడే పౌరులుగా పిల్లలు ఎదగాలి శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం. నేటి సమాజంలో పాశ్చాత్య దేశాల సంప్రదాయాల వైపు చూస్తున్న వేళ, చిన్నారులకు ఆధ్యాత్మికతవైపు అడుగులు వేసేలా ప్రయత్నం చేస్తున్న జంగాల రాజేష్ నవ్య దంపతుల కుమార్తె శాస్త్ర మహీ చిన్న వయసు నుండే భక్తి మార్గంలోకి వెళుతున్నచిన్నారికి అందరూ అభినందనలు తెలుపుతున్నారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభను కనబరిచిన నాలుగేళ్ల బాలిక అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఇటీవల ఆన్లైన్లో హనుమాన్ చాలీసా పోటీ పెట్టగా హనుమంతుడిపై అపార భక్తిని చాటుతూ కేవలం నాలుగు నిమిషాలలోనే చాలీసాను ఎలాంటి తడబాటు లేకుండా పూర్తి హనుమాన్ చాలీసాను అనర్గళంగా పారాయణం చేసి ప్రశంసలు అందుకుంది. వివిధ రంగాలలో చదువులో, ఆటల్లో, నాట్యంలో ప్రావిణ్యం పొందిన చిన్నారి శాస్త్ర మహీ ప్రతిభకు శ్రీరంగం ఫౌండేషన్ ద్వారా ప్రోత్సాహకార చేయూత నగదు రూపంలో మాదాపూర్ లోని కార్యాలయంలో శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం చేతులమీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఇందుమతి శ్రీరంగం మాట్లాడుతూ చదువుతో పాటు పిల్లలలోని సహజ ప్రతిభను వెలికితీయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించాలని అన్నారు. కష్టపడితే ఏదైనా సాధ్యమని, విజయానికి పట్టుదలే పునాది అని, పిల్లలు సమాజంలో ఎంత ఎదిగితే అంత తల్లితండ్రులు సంతోషిస్తారని పిల్లలు కూడా సమాజంలో గౌరవం పొందుతారని అన్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని చిన్నారి శాస్త్ర మహీని స్వయంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న ప్రభుత్వం: ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, జూన్ 18 (వన్‌నేషన్): ఎన్నికలు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న ప్రభుత్వము కూటమి ప్రభు అని ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మిగనూరులో కూటమి ప్రభుత్వ రెండేళ్ల సందర్భంగా నిర్వహించిన భారీ మోటార్ బైక్ ర్యాలీ, విజయోత్సవ సభ ఎమ్మెల్యే బీ.వీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య సర్కిల్, శివ సర్కిల్, సోమప్ప సర్కిల్, శ్రీనివాస టాకీస్ సర్కిల్, మార్కెట్ యార్డ్ సర్కిల్, ఓం శాంతి సర్కిల్, స్టేట్ బ్యాంక్ సర్కిల్ మీదుగా కుర్నీ కళ్యాణ మండపం వరకు భారీ ఎత్తున ర్యాలీ సాగింది.అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె కృష్ణమ్మ, ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిశీలకులు ముని శేఖర్ రెడ్డి, పట్టణ బూత్ పరిశీలకులు పోతురాజు రవికుమార్, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తొగట నరసింహులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీమతి రేఖా గౌడ్ తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మూడు పార్టీల జెండాలను ఆవిష్కరించి, స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి మా తెలుగు తల్లి" ప్రార్థనా గీతంతో సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా గురజాలకు చెందిన ఎస్సీ నాయకులు పెద్ద కిషన్ మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని, తెలుగుదేశం పార్టీ అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తోందని పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్





మాట్లాడుతూ స్వర్గీయ బి.వి. మోహన్ రెడ్డి గారి ఆశయాలను కొనసాగిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని కొనియాడారు. బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తొగట నరసింహులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేయబడిందని, జన్ ధన్ పథకం ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించారని అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీమతి రేఖా గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, గ్రామీణ ప్రగతిలో కూటమి ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. విజయోత్సవ సభను ఉద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అగైన్... అగైన్... ఎన్డీఏ, నో అగైన్... వైసీపీ అంటూ ప్రజల తీర్పుతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో కొత్త చరిత్ర సృష్టించిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు తల్లికి వందనం, స్త్రీ శక్తి, దివ్యాంగ శక్తి, దీపం-2, అన్నా క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, ఆటో డ్రైవర్ల సంక్షేమ కార్యక్రమాలు విజయవం తంగా అమలవుతున్నాయని తెలిపారు.చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, డీఎస్సీ ద్వారా భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టామని పేర్కొన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా తాగునీరు, సాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బీఎల్ఏలు, బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ మై టిడిపి యాప్ ద్వారా ప్రతి ఓటరును ధృవీకరించి ఎన్యూమరేషన్ ఫారాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం కార్యకర్తలతో భోజన విందులో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ కామర్తి మిన్నప్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ మల్లయ్య, మండల, పట్టణ అధ్యక్షులు, క్లస్టర్లు, యూనిట్, బూత్ కన్వీనర్లు, వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గేమ్ ఛేంజర్ గా స్త్రీశక్తి పథకం

ఆర్టీసీ కార్మికులఅంకితభావం,చిత్తశుద్ధి కారణంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం సరికొత్త రికార్డులను సృష్టిస్తూ దూసుకుపోతోంది. ఏ పథకం విజయవంతం కావాలన్న కార్మికుల సేవలే కీలకం. రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారతకు ఈ పథకం ఒక గేమ్ ఛేంజర్గా నిలిచింది. అధికారిక ప్రకటన ప్రకారం.. ఈ పథకం ప్రారంభమైన తొమ్మిది నెలల్లో ఏకంగా 67 కోట్లకు పైగా మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. ఆర్టీసీని కేవలం ప్రజా రవాణా వ్యవస్థగా కాకుండా మహిళలు, దివ్యాంగులు, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే సంక్షేమ వేదికగా కూటమి ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునేతృత్వంలో అమలవుతున్న "స్త్రీ శక్తి" పథకం రాష్ట్రవ్యాప్తంగా మహిళల జీవితాల్లో పెద్ద మార్పుకు దారితీస్తోంది. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు ఆర్థిక వెసులుబాటు కలగడంతో పాటు ఆర్టీసీకి కూడా భారీ స్థాయిలో ప్రయాణికుల ఆదరణ పెరిగింది.

### 9 నెలల్లో 67 కోట్ల ఉచిత ప్రయాణాలు

2025 ఆగస్టు 15న ప్రారంభమైన స్త్రీ శక్తి పథకం కేవలం తొమ్మిది నెలల్లోనే రికార్డు స్థాయిలో స్పందన అందుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 67 కోట్ల ఉచిత ప్రయాణాలు చేయగా, ప్రభుత్వం ఇందుకోసం సుమారు రూ. 2350 కోట్ల సబ్సిడీ భరించింది. ఇందులో భాగంగా ఆర్టీసీకి ఇప్పటికే రూ. 720 కోట్ల మేర రీయింబర్స్‌మెంట్ అందించింది.

ఈ పథకం వల్ల ప్రతి కుటుంబానికి నెలకు సగటున రూ. 2 వేల నుంచి రూ. 2,500 వరకు ఆదా అవుతోందని లబ్దిదారులు చెబుతున్నారు. ఉద్యోగినులు, విద్యార్థినులు, మహిళా రైతులు, చిన్న వ్యాపారులు తమ ప్రయాణ ఖర్చులు తగ్గడంతో ఆర్థికంగా ఊరట పొందుతున్నారు.

### ఆర్టీసీకి పెరిగిన ఆక్యుపెన్సీ

ఆర్టీసీ కార్మికులు అంకితభావంతో పనిచేస్తుండడం వల్ల (స్త్రీ శక్తి పథకం ప్రభావంతో ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో భారీగా పెరిగింది. గతంలో సుమారు 60 శాతంగా ఉన్న ఆక్యుపెన్సీ ప్రస్తుతం 92 శాతానికి చేరినట్లు అధికారులు చెబుతున్నారు. మహిళలతో పాటు పురుష ప్రయాణికుల సంఖ్య కూడా పెరగడం ఆర్టీసీ ఆదాయ వృద్ధికి తోడ్పడుతోంది. ప్రభుత్వం నుంచి సబ్సిడీ అందుతుండగా, పెరిగిన ప్రయాణికుల రద్దీ ద్వారా ఆర్టీసీకి అదనపు ఆదాయం లభిస్తోంది. ఈ విధంగా స్త్రీ శక్తి పథకం సంక్షేమంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థకు కూడా బలాన్నిస్తోంది.

### ఉద్యోగుల,కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల కార్మికుల సంక్షేమంపై కూడా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే డ్రైవర్లు, కండక్టర్లకు ప్రతి నైట్ డ్యూటీకి రూ.150 చొప్పున నైట్ అవుట్ అలవెన్స్ మంజూరు చేసింది. దీని వల్ల ఉద్యోగులకు నెలకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు అదనపు ఆదాయం లభిస్తోంది.

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను కూడా ప్రభుత్వం వేగవంతం చేసింది. 2020కు ముందు నియమితులైన సుమారు 7 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతో ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

### SBI బీమా, రిటైర్డ్ ఉద్యోగులకు EHS

ఆర్టీసీ ఉద్యోగులకు కార్మికులకు SBI ప్రత్యేక బీమా పథకాన్ని వర్తింపజేయడం ద్వారా ప్రభుత్వం భద్రతా కవచం కల్పించింది. రూ.1 కోటి ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.10 లక్షల బీమా వంటి ప్రయోజనాలు ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇస్తున్నాయి. రిటైర్డ్ ఉద్యోగులకు జీవితాంతం జునూ వైద్య సేవలు అందేలా తీసుకున్న నిర్ణయం కూడా మానవీయ చర్యగా ప్రశంసలు అందుకుంటోంది.

### కొత్తబస్సులు ఈవీలతో ఆధునికీకరణ

ప్రజా రవాణాను ఆధునికీకరించే దిశగా ప్రభుత్వం 1,489 కొత్త బస్సులను ప్రవేశపెట్టింది. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, స్టార్ లైనర్, వెన్నెల బస్సులు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నాయి. అదనంగా కేంద్ర సహకారంతో సుమారు 1450 ఈవీ బస్సులను అందుబాటులోకి తీసుకురానుంది. 338 బస్ స్టేషన్ల అభివృద్ధికి రూ.30 కోట్లు కేటాయించగా, డిజిటల్ ఫీడ్‌బ్యాక్ వ్యవస్థ ద్వారా ప్రయాణికుల అభిప్రాయాలను నేరుగా సేకరిస్తున్నారు. ప్రతి వారం ఆర్టీసీ సేవలపై సీఎం సమీక్ష నిర్వహిస్తూ సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఏది ఏమైనా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం విజయవంతం చేయడంలో ఆర్టీసీ డ్రైవర్లు,కండక్టర్ల కృషి అభినందనీయం



వాసంశెట్టి సుభాష్ - కార్మికశాఖ మంత్రి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# బొడ్రాయి మహోత్సవానికి రావాలంటూ జోనల్ కమిషనర్ కి ఆహ్వాన పత్రిక

**బాలాపూర్, జూన్ 18 (వన్‌నేషన్):** బాలాపూర్ లో ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్న బొడ్రాయి మహోత్సవ పండుగ కు సంబంధించిన ఆహ్వాన పత్రికని జిహెచ్ఎంసి శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ కి అందజేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి మరియు కమిటి సభ్యులు వివిధ పార్టీల నాయకులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, రఘునందన చారి, కళ్ళెం ఎల్లారెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి తదితరులు.



# ప్రభుత్వ విజయవంతమైన రెండేళ్ల సంపూర్ణ సుపరిపాలన



**ఎమ్మిగనూరు జూన్ 18 MD యూసుఫ్ (వన్ నేషన్) :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వ విజయవంతమైన రెండేళ్ల సంపూర్ణ సుపరిపాలన, అభివృద్ధి మరియు సంక్షేమ ప్రస్థానాన్ని పురస్కరించుకుని.. గౌరవ శాసనసభ్యులు డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి గారి సారథ్యంలో నిర్వహించబడుతున్న విజయోత్సవ సభ కు మరియు భారీ బైక్ ర్యాలీకి కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయడం జరిగింది. వేదిక: కుర్ని కమ్యూనిటీ హాల్, ఎమ్మిగనూరు వడ్డే కృష్ణ 29వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి జై చంద్రబాబు నాయుడు జై లోకేష్ బాబు జై BV.జయనాగేశ్వరరెడ్డి గారు జై తెలుగుదేశం జైజై తెలుగుదేశం.

# జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య కల్పించాలి - ఏపీడబ్ల్యూజేఎఫ్



**ఎమ్మిగనూరు, జూన్ 18 (వన్ నేషన్) :** రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) గౌరవ అధ్యక్షులు వి దేవేంద్ర మూర్తి, గిప్సన్, తాలూకా అధ్యక్షులు షబ్బీర్, కార్యదర్శి నాగరాజ్ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు మండల విద్యాధికారి ఆంజనేయులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు సమాచారాన్ని చేరవేసే బాధ్యతాయుతమైన వృత్తిలో పనిచేస్తున్నప్పటికీ, వారి పిల్లల విద్యాభారం రోజురోజుకూ పెరుగుతోందని నాయకులు పేర్కొన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు కనీసం 50 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా కమిటీ నాయకులు నరసింహులు, సోహెల్, సునీల్, రెహమాన్, సురేంద్ర, మురళి, మోషా, రాజు, విజయ్, లతీఫ్, ఖాదర్, బేగ్ రుక్మాన్, ఈరన్న, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

# గోవా లిక్కర్ టు జవహర్‌నగర్ క్వార్టర్

**-రెడ్డి శెట్టి శ్రీనివాస్ మహేష్ ఇంట్లో - గోవా విదేశీ అక్రమ మద్యం పట్టివేత -**

**ఇల్లు కాదు అది బార్: రెడ్డి శెట్టి బ్రదర్స్ మద్యం సామ్రాజ్యం**







**హైదరాబాద్, జూన్ 18 (వన్‌నేషన్):** జవహర్‌నగర్, మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ నకిలీ, గోవా మరియు విదేశీ మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు మంగళవారం సాయంత్రం దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ & ఎక్సైజ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు, ఏసీఆర్ఆర్ ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా డిపిఇఓ మల్కాజ్‌గిరి, ఎఇఎస్ మల్కాజ్‌గిరి పర్యవేక్షణలో జిల్లా టాస్క్‌ఫోర్స్ (DTF) మల్కాజ్‌గిరి మరియు ఎస్‌హెచ్ఓ కాప్రా బృందాలు సంయుక్తంగా జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టాయి. ఈ దాడుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, భారీగా విదేశీ, స్థానిక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలాజీనగర్‌లోని వెంకటేశ్వర కాలనీలో నివసించే రెడ్డి శెట్టి మహేష్ (50) అనే వ్యక్తి ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా గోవా, విదేశీ మద్యాన్ని నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీనిపై దాడి చేసిన ఎక్సైజ్ సిబ్బంది అతని వద్ద నుండి వివిధ బ్రాండ్లకు చెందిన 51.55 లీటర్ల పరిమాణం గల 59 సీసాల గోవా, విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకొని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అలాగే అదే ప్రాంతంలోని మోహన్ రావు కాలనీలో రెడ్డి శెట్టి శ్రీనివాస్ (52) అనే వ్యక్తి నివాసంలో జరిపిన సోదాల్లో 112 సీసాల గోవా, విదేశీ మద్యం (75.75 లీటర్లు), అలాగే తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే విక్రయించడానికి అనుమతి ఉన్న 251 సీసాల డ్యూటీ పెయిడ్ విస్కీ (129.66 లీటర్లు) పట్టుబడింది. ఈ ఘటనపై అధికారులు COR No. 30/2026 కింద కేసు నమోదు చేశారు. ం

అక్రమంగా మద్యం తరలించి, విక్రయిస్తున్న నిందితులిద్దరిపై చట్టపరమైన కేసులు నమోదు చేసిన అధికారులు, అనంతరం బిఎన్ఎస్ఎస్ (BNSS), 2023 లోని సెక్షన్ 35(3) కింద స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం అనుమతించిన మద్యం దుకాణాల్లో తప్ప, ఇళ్లలో ఇలా అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**

# దండలు రెడీ చేస్కోండి

**కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 18 (వన్ నేషన్):**
చట్టం న్యాయం ధర్మం
అన్నీనేడు ఒక్కచోటే
మాటల్లేవ్ మాట్లాడటాల్లేవ్
మూడిందంతే...!
పుణ్యం పాపం
దేవుడెరుగు
అయినా దేవుళ్ళకే శఠగోపం పెట్టే
సన్యాసుల కాలంలో
వాటికి తావుందా...?
ఈ క్షణంపై చేయి
పలుకుబడి, పరపతి,
పైసా ఉన్నోడిదే
రేపెవడిదో...?
కోర్టులో గెలవొచ్చు,ఓడొచ్చు
ఆసుపత్రిలో రోగం కుదరొచ్చు,పోవొచ్చు
అదేంటో కొన్ని స్టేషన్ లలో
న్యాయానికి బదులు
దండనే కాదు...!
దండలు రెడీ చెస్కొమ్మని
హుకుం
బూడిద మిగల్చని తీర్పులు.



**-కొండూరి కోటిబాబు,**
**హైకోర్టు అడ్వకేట్,**
**సురవరం ప్రతాపరెడ్డి**
**తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.**

# వనమహోత్సవానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**(1వ పేజీ తరువాయి)**



అంతర్జాతీయ స్థాయి ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. గుర్రంగూడ ఎకో పార్క్ భూములను ప్రైవేటు లేఅవుట్లుగా మార్చే ప్రయత్నాలను ప్రభుత్వం అడ్డుకుందని, సుప్రీంకోర్టులో పోరాడి 424 ఎకరాలను నేషనల్ పార్క్‌గా ప్రజలకు అంకితం చేశామని తెలిపారు. చెరువులు, నాలాలు, పార్కులపై ఆక్రమణలు పెరగడం వల్ల కాలనీలు వరద ముప్పుకు గురవుతున్నాయని, ప్రజల రక్షణ కోసమే హైడ్రా (HYDRAA)ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సొంత స్థలాల్లో ఇళ్లు కట్టుకునే సామాన్య ప్రజల జోలికి హైడ్రా వెళ్లదని, చెరువులు, నాలాలు, పార్కులను ఆక్రమించిన వారిపై మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని, మూసీ నది కాలుష్యం నివారణకు మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర మూసీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.దభారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని, 30 వేల ఎకరాల్లో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టులో 15 వేల ఎకరాల్లో అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి 60 శాతం పచ్చదనాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించి భవిష్యత్ తరాలు గర్వించే నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్ అభివృద్ధికి అవసరమైన అన్ని నిధులను ప్రభుత్వం సమకూర్చుతుందని, ప్రజల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ "వనమహోత్సవం అనేది కేవలం మొక్కలు నాటే కార్యక్రమం కాదు... ఇది ప్రకృతిని కాపాడే ప్రజా ఉద్యమం. 1950లో భారత జాతీయ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ మహోన్నత కార్యక్రమాన్ని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో మహా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దుతున్నాం. గుర్రంగూడ అటవీ ప్రాంతం తెలంగాణ ప్రభుత్వ సంకల్పానికి, అటవీ శాఖ పట్టుదలకు, న్యాయపరమైన విజయానికి ప్రతీకగా నిలిచింది. సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పుతో 102 ఎకరాల అటవీ భూమిని తిరిగి సాధించగలిగాం. అనంతరం మొత్తం 424 ఎకరాల 31 గుంటల భూమిని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించడం తెలంగాణ అటవీ సంరక్షణ చరిత్రలో ఒక మైలురాయి. హైదరాబాద్ నగరానికి ఊపిరితిత్తులుగా మారబోయే గుర్రంగూడ ప్రాంతంలో రూ.17.84 కోట్లతో అర్బన్ ఫారెస్ట్ పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగడం ఎంతో సంతోషకరం. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.17.66 కోట్ల విలువైన పర్యావరణ, ఈకో టూరిజం ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా ప్రకృతి ఆధారిత పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి నిరూపితమైంది. స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, జీవవైవిధ్యాన్ని పరిరక్షిస్తూ ఈకో టూరిజం ప్రాజెక్టులను అమలు చేస్తున్నాం. అటవీ భూముల రక్షణకు డ్రోన్ సర్వేలు, GIS మ్యాపింగ్, సరిహద్దుల గుర్తింపు, ప్రహరీ గోడల నిర్మాణం వంటి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నాం. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ప్రకృతి సమతుల్యత కోల్పోవడమే. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తగ్గుతున్న భూగర్భ జలాలు మనందరికీ హెచ్చరికలు. వీటిని అధిగమించాలంటే అడవుల విస్తీర్ణాన్ని పెంచడమే మార్గం.

ప్రతి విద్యార్థి ఒక మొక్కను పెంచాలి... ప్రతి కుటుంబం ఒక మొక్కకు బాధ్యత వహించాలి. జాతీయ అటవీ విధానం నిర్దేశించిన 33 శాతం అటవీ విస్తీర్ణ లక్ష్య సాధనకు అందరం భాగస్వాములు కావాలి. పచ్చని తెలంగాణ -- ఆరోగ్యకరమైన తెలంగాణ -- సుసంపన్న తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరి సహకారం అవసరం. మనమందరం కలిసి మొక్కను నాటి, దాన్ని సంరక్షించి, భవిష్యత్ తరాలకు పచ్చని తెలంగాణను అందిద్దాం." అని మంత్రి అన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణను సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని మంత్రి అన్నారు. వనమహోత్సవం కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదని, భవిష్యత్ తరాలకు పచ్చని తెలంగాణను అందించే మహత్తర ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. అటవీ భూములను పరిరక్షించడం, ఆక్రమణల నుంచి కాపాడడం, ప్రకృతి సమతుల్యతను కాపాడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో విలువైన అటవీ భూములను తిరిగి అటవీ శాఖ పరిధిలోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఒకవైపు పరిశ్రమలను ప్రోత్సహిస్తూ ఉపాధి అవకాశాలను పెంచుతూనే, మరోవైపు అడవులు, చెరువులు, కుంటలు, వన్యప్రాణులను పరిరక్షించే చర్యలను చేపడుతోందని వివరించారు. అభివృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణ రెండూ పరస్పర విరుద్ధమైనవి కావని, రెండింటినీ సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో పచ్చని తెలంగాణ, పర్యావరణ సమతుల్యత (Ecological Balance) సాధన కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిస్తూ, వనమహోత్సవాన్ని ప్రజలందరి ఉద్యమంగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ శ్రీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, మాజీ ఎంపీ మధు యాష్కీ, వివిధ సంస్థల చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, చిలుక మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అటవీ శాఖఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కొలను శంకర్ రెడ్డి జన్మదిన వేడుకలు

## ప్రముఖుల శుభాకాంక్షల వెల్లువ





**బాలాపూర్, జూన్ 18 (వన్‌నేషన్):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, భారతీయ జనతా పార్టీ కో–ఆపరేటివ్ సెల్ తెలంగాణ కన్వీనర్ కొలను శంకర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తన నివాసంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొలను శంకర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలకు పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున చేరుకుని పుష్పగుచ్ఛాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం మరియు భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కొలను శంకర్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని తెలిపారు.

# ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలి



**బాలాపూర్, జూన్ 18 (వన్‌నేషన్):** బడంగ్‌పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతనంగా పూర్తి అదనపు బాధ్యతలతో ప్రధాన ఆచార్యులుగా నియమితులైనటువంటి డాక్టర్ సురేష్ బాబు బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోస్త్ అడ్మిషన్లకై కాలింగ్ పోర్టల్ ద్వారా అందరూ అధ్యాపకులు ఫోన్ చేసి విద్యార్థులకు ప్రేరణ కల్పించవలసినదిగా సూచించారు. ఈ సంవత్సరంలో అదనంగా బీకాం కంప్యూటర్ అప్లికేషన్ లో 60 సీట్లు వచ్చినట్లుగా



తెలియజేశారు. ఈ కళాశాలకు నూతన భవనం కేటాయింపునకు కృషి చేస్తానని తెలిపారు. స్కాలర్షిప్ డ్రైవ్ ప్రోగ్రాంలో పాల్గొని విద్యార్థులందరూ ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల స్కాలర్షిప్ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ రాజకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రామరాజు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇంచార్జ నరసింహ రాజు, కెరీర్ గైడెన్స్ ఇంచార్జ డాక్టర్ జ్యోతి, లాంగ్వేజెస్ ఇంచార్జ్ డాక్టర్ రేవతి, స్కాలర్షిప్ కోఆర్డినేటర్ నరసింహ, డాక్టర్ కిరణ్మై, వెంకన్న, రోహిత్, విజయ, సుష్మిత, దీపకళ, లలిత, జియావుద్దీన్ పాల్గొన్నారు.

# సామాన్యులూ కంపెనీలు పెట్టాలి!

**(1వ పేజీ తరువాయి)**

చూడాలి. ఈ విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి. అనుబంధంగా ఎకోసిస్టమ్ ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టాలి. పనులు ప్రారంభించని సంస్థలతో అధికారులు టచ్‌లో ఉంటూ ఫాలోఅప్ చేయాలి. ఇథనాల్ తయారీ విషయంలో ఏపీ ముందడుగు వేయాలి. వాహనాల ఇంధనంలో 40 శాతం ఇథనాల్ బ్లెండ్ చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఇథనాల్ తయారీ పరిశ్రమను ప్రోత్సహిస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. బయో ఫ్యూయల్ రంగాన్ని మరింత ప్రోత్సహించాల్సి ఉంది. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీతో పాటు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ టెక్నాలజీదే భవిష్యత్తు. లిథియం అయాన్ బ్యాటరీల ఉత్పత్తి, ఈవీలకు ఫాస్ట్ చార్జింగ్ బ్యాటరీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సెమీ కండక్టర్ల పరిశ్రమలను ఎక్కువగా ప్రోత్సహించాలి. మైక్రో ఇరిగేషన్ రైతుల కోసం పరికరాల తయారీ పార్కును ఏర్పాటు చేయాలి. అమరావతిలో ఏఐ, అల్గారిథమ్స్ క్వాం టమ్ అప్లికేషన్ల రూపకల్పన మొదలైంది. క్వాంటమ్ వ్యాలీకి సంబంధించిన ఎకోసిస్టమ్ కల్పించండి. ప్రాజెక్టుల అనుమతులు, భూ కేటాయింపులు వంటివాటిని పారిశ్రామికవేత్తలకు సులభంగా అందేలా చూడండి. ఆటోమోటివ్ పరిశ్రమలకు శ్రీసిటీ సహా అనంతపురం జిల్లా కూడా కీలకం. తిరుపతి శ్రీసిటీలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ వస్తోంది. పుట్టపర్తిలో ఐదో తరం ఫైటర్ జెట్ విమాన తయారీ పరిశ్రమ వస్తోంది.

# మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**(1వ పేజీ తరువాయి)**

ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా వారికి 'రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేస్తామన్నారు. క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమం కోసం ప్రత్యేకంగా రూ.50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో శ్మశానవాటికలకు స్థలాలను కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇస్తామన్నారు.